లాభముంది. కాని దరిద్రగొట్టు వెధవ కాలు కదిపితే వడగళ్ళవాన ఎదురుగ వస్తుంది. ఏవేవో ఆలోచనలు తిరిగాయి. రకరకాల వుపాయాలు మెరిశాయి. ఒక్కటీ మానవమాత్రుడనేవాడికి సాధ్యమయ్యే వుపాయాలు కావవి!

లేచి యింటికి తిరిగి వచ్చేస్తున్నాడు. పైన ఎండ భాద్రపద మాసమైనప్పటికీ మహాతీక్షణంగా వుంది. తను చేస్తున్న ముష్టిపని మానేసి నారాయణ నడిగి వ్యాపారం మొదలుపెడితే? సలహా అతని దగ్గర తీసుకొంటేనే మంచిది. ఈ ఆలోచన కలగడమే తరవాయి, నారాయణ దుకాణంకేసి గబగబ అడుగులు వేశాడు.

నారాయణ అమూల ఏదో పని చేసుకొంటున్నాడు. గురువులు లోపలికి వచ్చాడు. ఆ నీడ చాలా హాయి అనిపించింది. కాసేపు అడగాలా వద్దా అని తటపటాయించాడు. నారాయణ తనకి తాను వెనక్కి చూసి పలకరించినప్పుడే అడగాలనుకొన్నాడు. కాని పావుగంట గడచిపోయినా అతనిటు తిరిగి గురువులుకేసి చూడలేదు. గురువులుకి మరిక నిలబడటం కష్టమనిపించి పిలవాలనుకొని తిరిగాడు. దృష్టి ఆ డ్రాయరుమీంచి దొర్లేసరికి జిగేల్‌మంది! ఊపిరి ఆడలేదు. కాళ్ళు భూమిలోకి క్రుంగిపోతున్నట్టనిపించింది. డ్రాయరుమీద మనీ పర్స్! తెరచేవుంది! పచ్చకాగితాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి! నారాయణకేసి చూశాడు.

ఛీ! అనిపించింది. తన్నుతాను తిట్టుకొంటూ జారిపోతున్న శక్తిని నిలదొక్కుకోవడానికి వ్యర్థప్రయత్నాలు చేశాడు. అవును, ఎందుకు తనంత పిరికిగా వొణికిపోవాలి? తనేమైనా దొంగతనం చేస్తున్నాడా? అలాంటి అభిప్రాయాలు కలుగుతున్నవా? మరెందుకు కంపించిపోవాలి?

చూడకూడదు చూడకూడదనుకొంటూనే మళ్ళీ ఆ పర్సుకేసి చూశాడు. కరెన్సీ నోట్లు తన దారిద్ర్యాన్ని జ్ఞప్తికి తెచ్చాయి. అక్కో జబ్బుకి చేసిన చక్రవడ్డీ అప్పు- ఇంటద్దె పాతిక- మడతకుడుముల బ్రతుకు- అన్నీ ఏదో చెవిలో రహస్యంగా చెప్పాయి. శ్వాస తీవ్రమయ్యే కొద్దీ విచక్షణా జ్ఞానం క్షీణించిపోతోంది. అటు చూశాడు. నారాయణసలు ఇటు చూడనే లేదు. చప్పున వెళ్ళి పర్సు లాగి జోబీలో కుక్కుకొని రోడ్డుమీదికి ఉడాయించాడు.

(ముగింపు వచ్చే సంచికలో)

కథానిక

# చెడిపోయిన సీతమ్మ

అవసరాల రామకృష్ణారావు

అశుభాన్ని సూచిస్తూ సీతమ్మ గుండెలు ధన్ ధన్‌మని కొట్టుకున్నాయి. లేకపోతే ఏమిటిది? మొన్న వినాయక చవితికి పదమూడేళ్లు వెళ్ళినా స్కూలు నుంచి రాగానే పుస్తకాలు గదిలో పడేసి తన ఒళ్ళో అయిదు నిమిషాలు ఆప్యాయంగా కూర్చోందే ఉండలేక పోయే వాడే మధు! ఇవాళ్టిదేమిటీ యిలా చేస్తే! తన వైపు చూడలేదు, తన ఊసులేదు! తిన్నగా గదిలోకి వెళ్ళి ముసుగుతన్ని పడుకున్నాడు. ఏమిటీ అలకలోని అంతరార్థం! బాధిత హృదయంతో గదిలోకి వెళ్ళింది సీతమ్మ.

"నాయనా మనూ! ఒంట్లో బాగులేదా? స్కూల్లో ఎవరేనా ఏమయినా అన్నారా? మేష్టారు కొట్టేరా?" మధ్య మధ్య భరించలేని నిశ్శబ్దాలతో వరుసగా అడిగింది సీతమ్మ. అంతకన్నా అడగవలసిన ప్రశ్నలు తోచలేదావిడకి. ఒక్కదానికీ జవాబు లేకపోవటం చూసి ఆమె మనస్సు సంశయంతో ఊగిసలాడింది. "ఏమిటిది? తన చేతుల్లో పెరిగిన వీడూ తండ్రి గుణాలే తెచ్చుకున్నాడా? సత్యాన్ని పరీక్షించలేని కళ్లు వీడికీ వచ్చాయా?"

అతని అలకకు కారణం, సంశయానికి అర్థం అడగకుండానే తెలుసుకుందా విజ్ఞానమయి. ఏనాడో ఒకనాడు ఈ సత్యం అతను గమనించ

వలసిందే, యీ నిజం అతను అవగాహన చేసుకోవలసిందే. జరిగిన విషయం చెప్పడం కోసం సీతమ్మ పదేళ్లు వెనక్కి వెళ్లవలసి వచ్చింది. ఆమె నెరసిన వెంట్రుకలకి మళ్లీ రంగేసుకోవలసి వచ్చింది.

* * *

"మీకంత బాధగా ఉంటే నా రెండుకళ్లు పొడిచెయ్యండి. అంతేకాని మీ అనుమాన నేత్రాలు చూడలేను. మనశ్శాంతి లేకుండా నిత్యం నీడలా నన్ను వెంబడించే మీ సంశయ వీక్షణాలు నేను భరించలేను. లేకపోతే ఎన్నిసార్లు చెప్పను చెప్పండి? "అతను నీకేమౌతాడు? ఏమౌతాడు?" అని పదిసార్లు అడుగుతారు. పోనీ ని పెత్తల్లి కొడుకో ఏదో అయి వరసకి అన్నో తమ్ముడో అయినా మీకూ లోకానికీ యింత అనుమానం లేకుండా ఉండేదేమో! ఎవరని చెప్పను? అతను నా స్నేహితుడు, అంతే! పాపాయి తోడుగా అతనికీ నాకు ఇంకే..."

"ఆ పాపాయీ అతని తాలూకే గా!"

"ఛీ! యీమాట అనడానికి మీకు నోరెలా వచ్చింది? ఇంతకన్నా నాకు నిలువునా నిప్పంటించెయ్యకూడదూ? నేను చచ్చేదాకా, బలవంతాన ప్రాణాలు తీసుకునేదాకా మీకీ అనుమానం తీరేలా లేదు. మీ కేవిధంగా, మీ మనస్సుకు నచ్చేలా హత్తుకొనేలా చెప్పాలో, ఋజువు చెయ్యాలో నాకు అర్థం కావడం లేదు!"

"ఏమైనా అంటే నేను మళ్ళీ మాట్లాడకుండా చదివేస్తావు. నీకు అంటే కోపంగాని అతన్ని రావద్దని ఎందుకు చెప్పవు?"

"ఎందుకు చెప్పాలి?"

"ఏమిట... న్నావ్? ఎందుకు చెప్పాలనా? సరే. నేనే చెప్తాను. నీకూ కూడా చెపుతాను! మీరిద్దరే సుఖంగా ఉండండి. ఆ మాట నీ నోరారా అన్నావు గనుక యింక నీకూ నాకూ సంబంధం లేదు!"

* * *

అవును. ఎందుకు చెప్పాలి మధూ? నాకు ప్రపంచంలో ఎవరేనా స్నేహితుడున్నాడంటే అతనొక్కడే! భగవంతుడు సాక్షిగా అతనికీ నాకూ ఏ సంబంధమూ లేదు. అతన్ని నా నోరారా రావద్దని ఎలా చెప్పను? అయినా ఎందుకు చెప్పాలి? చిన్నప్పుడెప్పుడో ఆడుకునే వాళ్ళం. తరువాత ఎవరిమటుకు వాళ్లు విడిపోయాం. పదేళ్ళకి తిరిగి మన యింటి ప్రక్కకి వాళ్లు కాపురానికొచ్చారు. ఎప్పుడేని వచ్చి గుక్కెడు మంచినీళ్లడిగితే అతనికి యివ్వడం కూడా తప్పేనా? చిన్నప్పట్నుంచీ నన్ను ఆవరించిఉన్న అభిమానం పౌరుషం నన్ను బాధించాయి. ఆవాళ్లా అలా గదిలో తల పట్టుకు కూర్చున్నాను. ఏముందింక? ఆయన వెళ్లిపొమ్మంటారు, అన్నారు కూడాను! ఇంట్లోంచి యీడిచేస్తారు! సంఘం, ప్రజలు, అందరూ మొగాడి పక్షమే! ఆడది శీలవతి అని రుజువుచేసుకోడం ఎంతకష్టం! అతనేం తప్పుచేశాడని అతన్ని పొమ్మనాలి? అలా ఆలోచిస్తూంటే విషాదకరమయిన మరో ఆలోచన నన్ను మేల్కొలిపి నన్ను మార్చేసింది - మధూ! ఆదేమిటంటావ్? నువ్వు, నీ చిరునవ్వు! కాపురానికి వచ్చిన పగిహేనేళ్ళకి పుట్టేవు నువ్వు. నిన్ను వదిలెయ్యాలి. నిన్ను ఆయన నా కివ్వరు, నాకు తెలుసు! నిన్ను, నిన్నెలా వదిలెయ్యగలను మధూ? వదిలేసి ఎవరికోసం బతకను? ఎవడో ఊరివాడి స్నేహంకోసం ఏదో మాట మీద అభిమానంకోసం పౌరుషం కోసం నా రక్తభాగాన్ని, నా పసిడిపంటను, వసులుకుని వాత్సల్యానికి వారధికట్టనా? ఎంత తెలివి తక్కువ. తిన్నగా ఆయనదగ్గరకు వెళ్ళేను. ఆయన అటుతిరిగి,

'నీ సామాన్లు అన్నీ సర్దించేశాను. ఈ రాత్రికే నువ్వు వెళ్ళిపోనమ్మ. అతనెలాగా స్టేషనుకు రాకమానడు. మీరిద్దరూ లోకాన్ని ఉద్ధరించనమ్మ!'

ఎంత హాస్యాస్పదమైన, అనాలోచితమైన మాట! వయస్సు మళ్ళిన కళ్ళకి అగుపడేవంతా అనుమానాస్పదమే కాబోలు. నా కప్పటికి ముప్పైయారేళ్లు. ఎవరో చిన్ననాటి మిత్రుడు స్నేహంగా పలకరిస్తే ఈ వయస్సులో నాకు మచ్చ కలిగించడాని కాయనికి యెంత హేయమనిపించలేదో! ఇప్పుడు అతనితో లేచిపోయి వేరే కాపురం పెట్టి పిల్లల్ని కంటానని ఆయనికి తోచడానికేనా అవమానమని యెందుకు అని

పించలేదో! తప్పు దారిలో పోతున్నవాడికి మంచి చెడ్డల విచక్షణ, సందర్భా సందర్భ విమర్శ ఉండదు కాబోలు! నాలో పౌరుషం ఉరకవేసి నా వాత్సల్యం దాన్ని అణచివేసింది.

"నా మాటకి నన్ను క్షమించండి. తొందరపడి ఏదో అనేశాను. అతను యెప్పుడేనా వస్తే రావద్దని గట్టిగా చెబుతాను. నాలో దోషం లేకపోయినా మీకు అనుమానం కలిగించే పనులెందుకు చెయ్యాలి?" ఆ మాటలు యెంత కష్టపడి అన్నానో నాకే తెలియాలి. ఆయన బుర్ర ఎలక్ట్రిక్ ఫాన్‌లా యిటు తిరిగింది.

"నీ నోట ఈ మాటకోసం ఏన్నాటినుంచి చూస్తున్నాను సీతా? నీ మీదేమైనా నాకు కోపమా, పగా? ప్రత్యేక ద్వేషమా? పాపాయిని పడుకోబెట్టి యిలా రా"

ఛీ! ప్రేమ అసహ్యంగా మారకూడదుగాని మారితే తిరగడం కష్టం. ఆయనమీద నాకే నాడో అసహ్యం కలిగింది. నేను అతన్ని రావద్దని చెబుతాననడం నీమీద ప్రేమచేతగాని ఆయనమీద అపేక్ష చేతగాదు. నేను సమాధానం చెప్పకుండా నిన్ను తీసుకు గదిలోకి వెళ్ళిపోయాను.

ఆ మరునాడే అతను మాయింటికి వచ్చాడు.

"మీరు మునపటిలా ఉండడంలేదు, ఎం చేతోగాని..."

"అదంతా మీకు అనవసరం. అవతలకి వెళ్ళండి" ఈ మాటలు నేనే అన్నానా అని తర్వాత ఆశ్చర్యపోయాను. అతనీ మాటలు విని తెల్లబోయాడు. ఒకక్షణం వెర్రిగా చూసి యిలా అన్నాడు.

"నావల్ల ఏం తప్పుందోగాని మీ ప్రవర్తన చాలా ఆశ్చర్యకరంగా ఉంది. సరే లెండి, మేము యీ ఊరునుంచి వెళ్ళిపోతున్నాం, చెప్పడానికి వచ్చాను. మనం చిన్నప్పుడు ఎంత స్నేహంగా, ఎంత పవిత్రప్రేమతో ఉండేవాళ్ళమో మీరు మరచినా నేను మరచిపోలేను. మీకు యిదిగో నా ఫొటో యివ్వడానికి వచ్చాను. గోడమీద మీ ఫొటో తీసి కెళ్ళిపోతున్నాను. ఎప్పుడేనా ఓసారి స్నేహంగా చూసుకుందాం."

నానోటంట మాట రాలేదు. నా ఫొటో అతను తీసుకువెళ్ళిపోయాడు తన ఫొటో కుర్చీమీద వదిలి. నాకళ్ళు నీళ్ళతో నిండిపోయాయి. మా అమ్మకీ నాన్నకీ నే ఒక్కర్తెనే. తోడబుట్టిన అభిమానం నే నెరగను. అది నాకు చూపించాడతను. అతన్ని ఎంత మాటాడేను!

అతను కుర్చీమీద పెట్టినది, నేను తియ్యలేదు. దానివైపే అలా అభిమానంతో చూస్తున్నాను. వెనకనుంచి ఎప్పుడొచ్చారో తెలీదు, ఎప్పుడు వీథిలోకి వెళ్ళేరో తెలీదు, ఎప్పుడు పదిమందిని వెంటబెట్టుకు వచ్చారో తెలీదు. నే అటు చూసేసరికి ఇంటినిండా మనుష్యులు!

"చూశారా! నామాట విన్నారు కాదు. ముప్పై ఏళ్ళది, ఆవిడకి రంకుకడతావ్ నీకేమయినా మతిపోయిందిటయ్యా అని నన్ను తిట్టేరు. ఇప్పుడు దీనికేం సమాధానం చెబుతారు!"

ఎవరూ ఏం మాట్లాడలేదు. అందరూ నావైపు విచిత్రంగా, అసహ్యంగా చూస్తున్నారు. నేను కన్నీళ్లు తుడుచుకున్నాను. నిన్ను తీసుకున్నాను. వెళ్ళిపోబామనుకున్నాను. ఆయన అడ్డగించారు. నిన్ను తీసుకున్నారు. నన్ను వీథిలోకి బరబర యీడ్చేశారు. తలుపేసేశారు. నేను ఏడవలేదు, నెత్తీ నోరూ బాదుకుని నా పాపాయిని నా కిచ్చెయ్యమనలేదు. న్యాయరీత్యా నువ్వు నాకు దక్కవని నాకు తెలుసు. ఆయన తలుపు తీసేదాకా అక్కడే ఉన్నాను. తలుపు తీసేశాక లోపలికి వెళ్ళి నా బట్టలన్నీ సర్దుకున్నాను. బండి చేయించుకుని వెళ్ళిపోయాను.

నేనేం డబ్బులేనిదాన్ని కాను. మా నాన్నకి నే ఒక్కర్తెనే అని ఇదివరకే చెప్పేను. ఆయన నా పేర రెండిళ్లు రాశిచ్చారు. అద్దె లొస్తాయి. అటుపైన భూములున్నాయి. నేనేం తప్పు చేశానని ఒకరి చేతికింద అణగిమణగి ఉండాలి? అలా ఉండే అవసరం నాకేమిటి? ఆనాడే వేరింటికి వచ్చేశాను. చెబితే వినే స్థితిలో లేరాయన. బోధపరచుకునే స్థితిలోనూ లేరు ప్రజలు. అంతకన్న నే అప్పుడు చేసేదేమిటి?

అన్నం వండుకుని నోట్లో పెట్టుకునే వేళకు కళ్ళంట గిర్రని నీళ్లు తిరిగిపోయాయి.

కంచంలో చెయ్యి కడిగేసుకున్నాను. ఆడది కోరేది అన్నం బట్టా నా? స్త్రీ వాంఛించేది ధనమూ ధాన్యమూ నా? ప్రేమించే భర్త హృదయం, ప్రేమించబడే శిశుహృదయం. వీటిని మించి ఆమెకు కావలసిందేమిటి? ఈ పాటికి నా పాపాయి వచ్చీరాని మాటలతో 'అమ్మా' అని చేతులతో నా బుగ్గలను స్పృశించేవాడు. వాడికి కానిది యెవడికోసం? కాలితో, కంచాన్ని తన్నేసి గదిలోపడుకున్నాను.

"ఆడదానికి మొగుడూ సంసారం కాక కావలసిందేముందమ్మా? చేసిందిచేసి యింకా ఆ పట్టుదల దేనికమ్మా?"

లోకం వెక్కిరించినట్టయింది. ఏమిటి నేను చేసింది? ఈ లోకానికి చెయ్యంది చెయ్యనట్టు యెప్పుడు కనిపిస్తుంది?

నాకు న్యాయశాసనంమీద విపరీతమయిన కోపంవచ్చింది. పది నెలలూ మోసి కనిపించిన తల్లికి లేదూ తన బిడ్డలమీద హక్కు? పిల్లలున్నవాడు పెట్టినవేనా ఈ శాసనాలు? అన్నట్టు న్యాయశాసనాలు కల్పించింది మొగాడేగా!

పాపాయిని విడిచి ఉండడం ఎంతకష్టమో నాకారాత్రి తెల్లవార్లూ అర్థమయింది. న్యాయమైన అభిమానాన్ని ఆడది వదిలివేయడం ఎంత కష్టమో కూడా ఆనాడే అర్థమయింది. ఆఖరికి మాతృప్రేమే జయించింది. నన్ను నలుగురిలో పెట్టి, రచ్చకీడ్చిన నా భర్తదగ్గరకయినా సరే, నా పాపాయికోసం వెళ్లడానికే నిశ్చయించుకున్నాను. సరిగ్గా మాటలురాని నా పాపాయి పిలుపే నన్ను దగ్గరకు రమ్మని పిలిచింది. ఓడిపోయి మరునాడు పొద్దున్నే బయలుదేరాను. దారిలో దాసీది కనిపించింది. ఇంచుమించు ఏడుస్తూ అడిగేను దాన్ని "నా పాపాయిని నే చూడటానికి వీలుంటుందిటే?" అని.

"ఎలా వీలుంటుంది తల్లీ? పాపాయి లేచిందగ్గర్నుంచి మీకోసం ఏడుపే-ఇవేళ జ్వరం కూడా వచ్చింది. అనకూడదుగాని ఆయన "పాపాయి చస్తే చావనీగాని దాన్ని పిలిపించను" అన్నారు. అయినా యిన్నాళ్ళూ అయాక మీకిదేం బుద్ధి తల్లీ?"

"పిలిపించే యిది ఆయనకు లేకపోయినా, నా పాపచే పిలిపించబడే హక్కు నాకున్నది రామీ! నన్నెవరూ అడ్డలేరు, నే వెళ్లకమానను"

"అంత పౌరుషం, అభిమానం ఉన్నవారు అలాంటి పనెందుకు చేశేరు తల్లీ? ఇన్నాళ్లయినాక ఆ దిక్కుమాలిన ముండాకొడుకు మీకెక్కడ దొరికేడు? ఆయనేమంటున్నారో తెలుసా? "డబ్బుతో సుఖం కొనుక్కుంటుందా, వెర్రిది వేరే ఉందా? ఉండనీ-తప్పని నా కాళ్ళటుకునేదాకా నే క్షమించను"" ఇంక నే దానివైపు చూడలేదు, దాని మాటలు వినలేను. ఇంటికి పరుపరుగున చేరుకున్నాను. దారిలో యీ మాటలు నా చెవులో ప్రతిధ్వనించాయి.

"డబ్బుతో సుఖం కొనుక్కుంటుందా? వెర్రిది!"

"పాపాయి చస్తే చావనీగాని దాన్ని పిలిపించను."

"తప్పని నా కాళ్లట్టుకునేదాకా నే క్షమించను."

'నాకు నువ్వు కావాలి, నువ్వు లేందే నే బ్రతకలేను. నీకోసం ఎంత త్యాగాన్నైనా భరించదల్చుకున్నాను. ఆయనకు నా సౌందర్యం ఋజువుపర్చే మార్గం నాకు తోచలేదు. ఆయన వినేపరిస్థితిలో లేరు. వెళ్లేను 'తప్పయిపోయింది క్షమించమని' ఆయన కాళ్ళట్టుకుని ఏడ్చాను. నా అభిమానాన్ని, మనసునీ, సత్యాన్ని సర్వాన్నీ చంపుకుని రోదించాను. ఆయన నన్ను గ్రహించారు. నిన్ను నేను గ్రహించాను. చాలు. అంతే. ఆనాటినుంచీ నేను లోకంలో కులటను. ప్రపంచంలో పతితను. మొగుడు కొడితే మాధవకబళంవాడు కొట్టేడని ప్రపంచానికంతటికీ నేను హాస్యవస్తువును. నవ్వులాటగా ఉపయోగపడే పరికరాన్ని. నేను అన్నీ భరించాను. ఆయన వెళ్ళిపోయినా శాశ్వతంగా విధించిన మచ్చను సంతోషంగా స్వీకరించాను. ఎందుకు? నీకోసం, నీ ప్రేమకోసం. లోకంలో ఎవరేమనుకున్నా నువ్వు నన్ను సుశీలగా గ్రహించగలుగుతే చాలు. అంతే నేకోరేది నాయనా."

"నన్ను క్షమించమ్మా!" అని మధు తల్లి కాళ్ళమీద యిమిడిపోయాడు. వాత్సల్యం వర్షించింది. సత్య సస్యాలు ఫలించాయి.